ఉద్యమ ప్రశ్నలు లేకుండానే గ్రూప్-1 పేపర్

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ ఆధునిక చరిత్ర, కరెంట్ అఫైర్స్, జనరల్ సైన్స్, పర్యావరణం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రశ్నలిచ్చారు. ప్రశ్నలు మధ్యస్తంగా ఉండగా, రీజనింగ్ ప్రశ్నలను చేధించేందుకు విద్యార్థులు కష్టపడాల్సి వచ్చింది. గత రెండు గ్రూప్ -1 పరీక్షలతో పోల్చితే ఆదివారం నిర్వహించిన పరీక్ష కాస్త సులభంగానే ఉన్నట్టుగా నిపుణులు విశ్లేషించారు. ఇక ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండటంతో చాలా మందికి సమయం సరిపోలేదు. సివిల్ సర్వీసెస్ పోటీ శిక్షకుడు బ్రెయిన్ ట్రీ డైరెక్టర్ గోపాలక్రిష్ణ మాట్లాడుతూ ప్రశ్నల క్లిష్టత సాధారణం నుంచి మధ్యస్తంగా ఉన్నట్టుగా విశ్లేషించారు. చాలా అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రశ్నపత్రాలను రూపొందించారని, చాలా కాలంగా ప్రిపరేషన్‌లో ఉన్నవారికి, అవగాహన గల వారికి అనుకూలమని పేర్కొన్నారు.

ఆలస్యంగా రావడంతో హైదరాబాద్ ఏవీ కాలేజీలోని గ్రూప్ పరీక్ష కేంద్రం వద్ద గేట్ బయట నిరుత్సాహంగా ఉన్నఅభ్యర్థులు

లక్షకుపైగా అభ్యర్థులు డుమ్మా

గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షకు లక్షకుపైగా అభ్యర్థులు డుమ్మాకొట్టారు. 4.03లక్షల మంది దరఖాస్తు చేయగా, 3.02లక్షల మంది (74శాతం)మాత్రమే పరీక్షకు హాజరైనట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. 536 పోస్టులుండగా, ఒక్కో పోస్టుకు 536 మంది చొప్పున పోటీపడనున్నారు. త్వరలోనే ప్రిలిమ్స్ కీని విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది. అక్టోబర్ 21 నుంచి గ్రూప్ -1 మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నారు. మల్టీ జోన్, రోస్టర్ ప్రకారం ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున 28,150 మంది మెయిన్‌కు క్వాలిఫై అవుతారు.

'నిమిషం' నిబంధనతో పరీక్షకు దూరం

పెద్దపల్లిరూరల్/ జగిత్యాల, జూన్ 9: నిమిషం నిబంధనతో పలువురు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు దూరమయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల వద్ద రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాంకు చెందిన నవ్యతోపాటు మరో ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. అలాగే కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన సాయిప్రియ పరీక్షకు హాజరయ్యేందుకు వస్తుండగా కూనారం రైలు గేటు పడడంతో ఐదు నిమిషాలు ఆలస్యమైంది. అధికారులు అనుమతించకపోవడంతో కన్నీటి పర్యంతమవుతూ చేసేదేమీలేక వెనుదిరిగి వెళ్లింది. మరో వైపు మంథనికి చెందిన ప్రసన్య పొరపాటున మరో మిత్రురాలి హాల్‌టికెట్ తీసుకురాగా, ఆమెను కూడా అధికారులు పరీక్షకేంద్రంలోకి అనుమతించలేదు.

తల్లి పరీక్ష రాయడానికి వెళ్లడంతో ఏవీ కాలేజీలోని గ్రూప్ పరీక్ష కేంద్రం వద్ద ఆరు బయట సెల్‌తో ఆడుకుంటున్న చిన్నారి

కటాఫ్ 75-80 మధ్య ఉండొచ్చు..

25ప్రశ్నలు లాజికల్ రీజనింగ్, అనలెటికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ఇచ్చారు. గణితం నేపథ్యమున్న వారికి ఇది అనుకూలం. పలు సర్వేలు, నివేదికల నుంచి ప్రశ్నలిచ్చారు. బాగా ప్రిపేరైన వారికి లాభించే అంశం. సుదీర్ఘమైన ప్రశ్నలివ్వడంతో చదివేందుకు అభ్యర్థులకు అధిక సమయం పట్టింది. జనరల్ కటాఫ్ 75-80 మార్కుల మధ్య ఉండొచ్చు.

-దీపికారెడ్డి, శిఖర అకాడమీ

ఇన్విజిలేటర్ టైం తప్పు చెప్పాడని జగిత్యాలలో అభ్యర్థుల ఆందోళన

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఓ సెంటర్ ఎదుట గ్రూప్-1 అభ్యర్థులు ఆదివారం ఆందోళన చేశారు. సెంటర్‌లోని రూమ్‌నంబర్ 213లో 24 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, ఇన్విజిలేటర్‌ను టైం ఎంతైంది? అని అడిగితే.. చివరి ఐదు నిమిషాలు మాత్రమే ఉందని చెప్పడంతో తొందరగా బబ్లింగ్ చేశామని పరీక్షకు హాజరైన శరత్ చంద్ర, మరో 23 మంది అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 20 నిమిషాలకు పైగా ఖాళీగా కూర్చున్నామని, ఆ తర్వాత అసలు విషయం తెలిసి క్రాస్ చెక్ చేయడంతో తెలిసిన సమాధానాలు కూడా తప్పుగా రాశామని వాపోయారు.

తప్పతాగి.. విధులకు

- ఓ జూనియర్ అసిస్టెంట్ నిర్వాకం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిమ్మాపూర్, జూన్ 9: ఓ ప్రభుత్వ ఉద్యోగి మద్యం సేవించి ఏకంగా ఆదివారం జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షల డ్యూటీకి వచ్చాడు. అంతేగాక తోటి సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు అప్పగించిన ఘటన కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా.. జమ్మికుంట రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మీర్జా పర్వేజ్‌బేగ్‌కు తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కాలేజీలోని సెంటర్‌లో ఐడెంటిఫికేషన్ ఆఫీసర్‌గా డ్యూటీ వేశారు. అయితే అప్పటికే మద్యం తాగి సెంటర్‌కు వచ్చిన ఆయన తోటి సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. అభ్యర్థులు సెంటర్‌లోకి వెళ్లగానే బయటకు వచ్చి వైన్స్‌లో బీరు కొనుగోలు చేసి రోడ్డు పక్కన తాగుతుండటంతో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఎస్సైల మీదికే తిరగబడుతూ ఉండగా, బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షలో 173 శాతం వచ్చింది. ఐడెంటిఫికేషన్ ఆఫీసర్‌గా అభ్యర్థులు సెంటర్‌లోకి వెళ్లేవరకే తన డ్యూటీ అని, తన డ్యూటీ అయిపోయాకే బయటకు వచ్చానని, తననెందుకు స్టేషన్‌కు తరలించారని ఎల్ఎండీ ఎస్సై చేరాలు, గన్నేరువరం ఎస్సై నరేశ్‌తోపాటు పోలీసులతో గొడవపడ్డాడు. మధ్యాహ్నం రెవెన్యూ శాఖ ఉద్యోగి, కుటుంబసభ్యులు వచ్చి ఆ ఉద్యోగిని స్టేషన్ నుంచి తీసుకెళ్లారు.

'గ్రూప్-4' వెరిఫికేషన్ జాబితా విడుదల

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4 సర్టిఫికెట్ వెరిఫికేషన్ జాబితాను విడుదల చేసినట్టు టీజీపీఎస్సీ ఆదివారం తెలిపింది. సంస్థ వెబ్‌సైట్‌లో జాబితాను పొందుపరిచామని పేర్కొన్నది. ఎంపికైన అభ్యర్థులు చెక్‌లిస్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. వెబ్ ఆప్షన్లతోపాటు లోకల్, అన్ రిజర్వ్‌డ్ క్యాటగిరీల వారీగా వివరాలు పొందుపరిచినట్టు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంతోపాటు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులకు ఈ నెల 13వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్ల లింక్ అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి పీఈ సెట్ సామర్థ్య పరీక్షలు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): బీపీఈడీ, డీపీఈడీ అడ్మిషన్ల కోసం ఫిజికల్ ఎఫిషియెన్సీ, స్కిల్ టెస్ట్‌లను సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు పీఈ సెట్ కన్వీనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం నుంచి 13 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులకు 100 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్‌తోపాటు ఒక స్కిల్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. వీటికితోడు పురుషులైతే 800 మీటర్లు, మహిళలకు 400 మీటర్ల పరుగు పందెం ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్ర డీజీపీ మార్పు?

- రెడ్డి వర్గానికే పోలీస్ బాస్ పదవి!
- రేసులో శివధర్‌రెడ్డి, సీవీ, కొత్తకోట
- డీజీపీ నుంచి కమిషనర్ల దాకా బదిలీ
- త్వరలోనే వెలువడనున్న ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): పోలీసుశాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారని తెలిసింది. ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వ నిర్ణయాలు అమలుకు, తమకు అనుకూలమైనవారిని కీలకపోస్టుల్లో నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఐపీఎస్‌ల బదిలీలు ముగిసిన వెంటనే డీజీపీ మార్పు ఉంటుందని భావిస్తున్నారు. అది కూడా రెడ్డి సామాజికవర్గం వారికే ఆ ఉన్నత పదవిని కట్టబెట్టే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. డీజీపీ రేసులో ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డి, ఏసీబీ డీజీగా ఉంటూ ప్రభుత్వ లంచాధికారుల వెన్నులో వణుకుపుట్టిస్తున్న సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. డీజీపీ రేసులో ఉంటారనుకుంటున్న హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్‌కు విజిలెన్స్ అదనపు బాధ్యతలు అప్పగించింది.

డీజీగా ప్రమోషన్ ఇచ్చి.. బాధ్యతలు అప్పగింత?

డీజీపీని మార్చాలనే ఆలోచన వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ శివధర్ రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అడిషనల్ డీజీ ర్యాంకులో ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డికి డీజీపీగా ప్రమోషన్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం డీజీపీ ర్యాంకులో నలుగురు సీనియర్ ఐపీఎస్‌లు కొనసాగుతున్నారు. రవిగుప్తాతోపాటు మాజీ డీజీపీ అంజనీకుమార్, సీవీ ఆనంద్, జితేందర్ ఉన్నారు. డీజీపీ ర్యాంకులోనే విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్‌రతన్ గుండెపోటుతో చనిపోయారు. టీఎస్ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేసిన సందీప్ శాండిల్య కొద్దిరోజుల క్రితం పదవీ విరమణ పొందినా, ఏడాది పాటు పదవీకాలం పొడిగించారు. ఈ రెండు డీజీపీ ర్యాంకులు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డికి డీజీపీలుగా పదోన్నతి ఇచ్చి.. శివధర్‌రెడ్డికి డీజీపీ బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం. ఆ స్థానంలో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి లేదా ఐజీ రమేశ్‌రెడ్డిని నియమించే అవకాశం ఉన్నది.

మొదట్నుంచి ముఖ్యమంత్రితోనే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా శివధర్‌రెడ్డి రేయింబవళ్లు పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి ఏ కార్యక్రమానికి వెళ్లినా.. తోడుగా శివధర్ రెడ్డి ఉంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే లూప్‌లైన్‌లో ఉన్న పలువురి సీనియర్ ఐపీఎస్‌లకు కీలక పోస్టులు ఇప్పించడంలో శివధర్‌రెడ్డి కృషి చేశారని పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

ఐజీల నుంచి ఎస్పీల వరకూ..

రాష్ట్రంలో అత్యంత కీలకమైన పోలీస్‌శాఖలో భారీ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. పోలీసుశాఖ బదిలీలకు సంబంధించి ఇప్పటికే ఫైలు కదిలిందని సమాచారం. రాచకొండ, కరీంనగర్, వరంగల్, రామగుండం కమిషనర్లకు స్థానచలనం కలిగే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. రెండు మల్టీజోన్లలోనూ ఐజీలకు బదిలీతోపాటు పలువురు అడిషనల్ డీజీలకు సైతం కొన్ని శాఖలను కేటాయిస్తారని ప్రచారం సాగుతున్నది. ఖాళీగా ఉన్న ట్రాఫిక్ అడిషనల్ సీపీ పోస్టును భర్తీ చేస్తారని తెలిసింది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడెవరు?

- తెరపైకి ఈటల, రఘునందన్ పేర్లు

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): కిషన్‌రెడ్డికి మరోసారి కేంద్ర క్యాబినెట్‌లో చోటు దక్కడంతో రాష్ట్ర బీజేపీ అధ్యక్ష బాధ్యతలు ఎవరికి ఇస్తారనే చర్చ మొదలైంది. గతంలో మాదిరిగానే అటు కేంద్ర మంత్రిగా, ఇటు అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి కొనసాగుతారని భావించినా, ఆయనకు ఈసారి కేంద్రంలో కీలక పదవి అప్పగిస్తారని భావిస్తున్నారు. దీంతో కచ్చితంగా అధ్యక్ష మార్పు ఉంటుందని అంటున్నారు. తదుపరి అధ్యక్షుడిగా ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో వరుసగా కీలక నేతలను కలుస్తుండటంతో ఈ వాదనకు బలం చేకూరుతున్నది. మిగతా నేతలతో పోల్చితే రాజకీయంగా అనుభవం ఉండటం ఈటలకు కలిసొస్తున్నదని చెప్తున్నారు. అధ్యక్ష పదవి రేసులో రఘునందన్‌రావు పేరు సైతం వినిపిస్తున్నది. రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో బీజేపీ పావులు కదుపుతున్న నేపథ్యంలో.. దూకుడుగా వెళ్లాలంటే రఘునందన్‌రావుకు అప్పగించాలనే డిమాండ్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఆయన అందరినీ కలుపుకొని వెళ్లలేడని, ఒంటెద్దు పోకడలతో నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతున్నది. సీనియర్ నేత ధర్మపురి అర్వింద్ సైతం అధ్యక్ష పదవి కోరుకుంటున్నట్టు తెలిసింది. మొదటినుంచీ పార్టీలో ఉండటం, వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలిచిన నేపథ్యంలో తనకు పదవి దక్కుతుందని అర్వింద్ భావిస్తున్నారు. వాస్తవానికి బండి సంజయ్‌ని తప్పించినప్పటి నుంచి అర్వింద్ ఆ పదవి కోసం ప్రయత్నిస్తున్నారని టాక్. ఈ ముక్కోణపు పోటీలో రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనేది పార్టీలో చర్చనీయాంశంగా మారింది.



500 ఏండ్లనాటి కాంస్య విగ్రహం తిరిగి భారత్‌కు

లండన్: సుమారు 500 ఏండ్ల నాటి కాంస్య విగ్రహాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తిరిగి భారత్‌కు అప్పగించనుంది. ఇది తమిళ కవి, స్వామీజీ తిరుమంకై ఆళ్వార్ విగ్రహం. దీనిని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని ఆష్మోలియన్ మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టారు. ఇది 16వ శతాబ్దానికి చెందినదని ఇండియన్ హై కమిషన్ తెలిపింది. దీనిని బ్రిటిషర్లు భారత్‌లోని ఓ ఆలయం నుంచి దొంగిలించి పట్టుకుపోయారని చెప్పింది. బ్రిటిష్ వలస పాలకులు 1897లో వేలాది కంచు, ఇతర లోహాలతో తయారైన కళాఖండాలను దోచుకెళ్లారు. సైనిక కార్యకలాపాల ఖర్చులకు వీటిని లండన్‌లో అమ్ముకునేవారు. ప్రపంచంలోనే అతి పెద్ద కట్ జెమ్స్‌లో ఒకటైన కోహినూర్ వజ్రం కూడా బ్రిటిషర్ల వద్ద ఉంది. రెండో ఆంగ్లో-సిక్కు యుద్ధంలో గెలిచిన ఈస్టిండియా కంపెనీ పంజాబ్ నుంచి కోహినూర్ వజ్రాన్ని ఎత్తుకెళ్లింది.

ఒడిశా తొలి ముస్లిం మహిళా ఎమ్మెల్యేగా సోఫియా

న్యూఢిల్లీ, జూన్ 9: ఒడిశా తొలి ముస్లిం మహిళా ఎమ్మెల్యేగా సోఫియా ఫిర్దౌస్(32) చరిత్ర సృష్టించారు. కేవలం 30 రోజుల ముందు అనుకోకుండా ఎన్నికల బరిలో నిలబడిన సోఫియా.. బీజేపీ అభ్యర్థి పూర్ణ చంద్ర మహాపాత్ర(69)పై 8,001 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఐఐఎం పూర్వ విద్యార్థి అయిన సోఫియా ఫిర్దౌస్ అనుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తండ్రి మహమ్మద్ మోక్విమ్ బారాబంకి-కటక్ మాజీ ఎమ్మెల్యే. ఆయన కుమార్తె సోఫియా ఫిర్దౌస్‌ను కాంగ్రెస్ పార్టీ పోటీలో నిలిపింది. 2014, 2019 ఎన్నికల్లో తండ్రి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించటం ఆమెకు ఈసారి బాగా కలిసివచ్చింది.

విజయ సంకేతం చూపుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, విద్యార్థులు

శ్రీచైతన్య విద్యార్థుల ఆల్‌టైమ్ రికార్డు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య తన అధిపత్యాన్ని కొనసాగిస్తూ.. ఆల్‌టైమ్ రికార్డు నమోదుచేసినట్టు విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు ఓపెన్ క్యాటగిరీలలో 4, 56, 9, 10, 12, 14 ర్యాంకులను విద్యార్థులు సాధించారని వెల్లడించారు. తమ విద్యార్థి రాఘవశర్మ ఆలిండియా మొదటి ర్యాంకు, రిథమ్ కేడియా 4వ ర్యాంకు, పుట్టి కుశాల్‌కుమార్ 5వ ర్యాంకు, రాజదీప్ మిశ్రా 6వ ర్యాంకు, ధృవిన్ హేమంత్‌దోషి 9వ ర్యాంకు, ఏ ఎస్ఎస్‌డీబీ సిద్ధ్విక్ సుహాస్ 10వ ర్యాంకు సాధించినట్టు వివరించారు. ఓపెన్ క్యాటగిరీలో టాప్ 10లోపు 5, వంద లోపు 30, వెయ్యిలోపు 202, వివిధ క్యాటగిరీల్లో 100లోపు 146, వెయ్యిలోపు 721 ర్యాంకులను కైవసం చేసుకొన్నట్టు తెలిపారు. మొత్తం తమ విద్యార్థులు 3,728 మంది క్వాలిఫై అయినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను సుష్మ అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు

అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా లీడర్‌గా నారాయణ

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు సత్తాచాటినట్టు డైరెక్టర్లు పీ సింధూర నారాయణ, పీ శరణినారాయణ తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, సౌతిండియా ఫస్ట్‌ర్యాంక్ నారాయణ విద్యాసంస్థలే దక్కించుకొన్నట్టు చెప్పారు. వివిధ క్యాటగిరీల్లో 6 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు నారాయణ విద్యార్థులే సాధించారని పేర్కొన్నారు. సందేశ్ బోగాలపల్లి 3వ ర్యాంకు, రాజ్‌దీప్ మిశ్రా 6వ ర్యాంకు, ఎం బాలాదిత్య 11వ ర్యాంకు, రాఘవ్‌శర్మ 12వ ర్యాంకు, బిస్మిత్ సాహు 16వ ర్యాంకు, ఆర్యన్ ప్రకాశ్ 17వ ర్యాంకు, ఆమోఘ్ అగర్వాల్ 20వ ర్యాంకు సాధించినట్టు వివరించారు. ఓపెన్ క్యాటగిరీలో టాప్ 20లో 7, వంద లోపు 31 ర్యాంకులతో అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా లీడర్‌గా నిలిచినట్టు వారు పేర్కొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్‌గా లాహోటి

- 360కి 355 మార్కులు.. జేఈఈ చరిత్రలోనే అత్యధికం

న్యూఢిల్లీ, జూన్ 9: దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) - అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వేద్ లాహోటి 360 మార్కులకు గానూ 355 మార్కులు సాధించి ఫలితాల్లో టాప్ ర్యాంకు సాధించాడు. జేఈఈ చరిత్రలోనే అత్యధిక మార్కులు ఇవి. ఆదిత్య(ఐఐటీ ఢిల్లీ జోన్) రెండో ర్యాంకు, భోగల్‌పల్లి సందేశ్(ఐఐటీ మద్రాస్ జోన్) మూడో ర్యాంకు సాధించారు. అమ్మాయిల్లో ఐఐటీ బాంబే పరిధికి చెందిన ద్విజ ధర్మేశ్ కుమార్ పటేల్ 332 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఆమెకు ఆల్ ఇండియాలో ఏడో ర్యాంకు లభించింది.

మద్రాస్ జోన్ నుంచే ఎక్కువ మంది

టాప్ 10 ర్యాంకుల్లో నాలుగు ఐఐటీ మద్రాస్ పరిధికి చెందిన వారే దక్కించుకున్నారు. ఐఐటీ మద్రాస్ జోన్ నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఆ తర్వాత ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే జోన్‌ల పరిధికి చెందిన అభ్యర్థులు అర్హత పొందారు. మొదటి 500 ర్యాంకులు సాధించిన వారిలోనూ ఐఐటీ మద్రాస్ జోన్‌కు చెందిన వారు 145 మంది ఉండగా, ఐఐటీ బాంబే జోన్ నుంచి 136, ఐఐటీ ఢిల్లీ జోన్ నుంచి 122 మంది ఉన్నారు. ఏడుగురు విదేశీ విద్యార్థులు, 179 మంది ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) విద్యార్థులు కూడా పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. కాగా, సీట్ల భర్తీకి సోమవారం నుంచి కౌన్సిలింగ్ జరగనుంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలంగాణ జయకేతనం

మొదటిపేజీ తరువాయి...

మార్కులతో మద్రాస్ జోన్ మహిళా టాపర్‌గా నిలిచింది. శ్రీనిత్య ఆలిండియా ఓపెన్ కోటాలో 268 ర్యాంకును సాధించింది. అన్ని ఫలితాల్లో అమ్మాయిలు సత్తాచాటుతుండగా, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మాత్రం అబ్బాయిల హవా కొనసాగింది. ఈ పరీక్షకు అత్యధికంగా అబ్బాయిలే హాజరుకాగా, క్వాలిఫై అయినవారిలోనూ అత్యధికంగా వారే ఉన్నారు. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు జాతీయంగా 1,86,584 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1,80,200 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 48,248 మంది క్వాలిఫై అయ్యారు.

- అబ్బాయిలు 1,43,637 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1,39,180 మంది పరీక్షకు హాజరుకాగా 40,284 మంది క్వాలిఫై అయ్యారు.
- అమ్మాయిలు 42,947 మంది దరఖాస్తు చేసుకుంటే, 41,020 హాజరుకాగా, 7,964 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు.
- ఈ ఏడాది జనరల్ క్యాటగిరీ విద్యార్థులు 14వేల మంది క్వాలిఫై కాగా, ఎస్సీ క్యాటగిరీ విద్యార్థులు 13వేల మంది క్వాలిఫై అయ్యారు. ఓబీసీ విద్యార్థులు 9వేల మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు.

సౌత్ జోన్ మహిళ టాపర్‌గా శ్రీనిత్య దేవరాజ్

ఖైరతాబాద్, జూన్ 9: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలంగాణ విద్యాకుసుమం సత్తా చాటింది. రెండు లక్షల మంది విద్యార్థుల్లో సౌత్ జోన్‌లోనే మహిళ టాపర్‌గా నిలిచింది హైదరాబాద్‌కు చెందిన శ్రీనిత్య దేవరాజ్. నిమ్స్ యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, అనస్థీషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిరా దేవరాజ్ దంపతుల కుమార్తె శ్రీనిత్య దేవరాజ్ చిన్నప్పటి నుంచే చదువులో టాపర్‌గా నిలిచింది. నగరంలోని నారాయణ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తూ ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 268వ ర్యాంకు సాధించింది. బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్నది తన ఆశయమని శ్రీనిత్య పేర్కొన్నారు.

శ్రీనిత్య దేవరాజ్

'నల్లమల విద్యార్థి ప్రజిత్‌కు 117వ ర్యాంక్

అచ్చంపేట/అచ్చంపేట టౌన్, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అచ్చంపేటకు చెందిన శివ్వా రామ్‌నాగ ప్రజిత్, అరవింద్‌నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ప్రతిభ కనబర్చారు. ప్రజిత్ ఆలిండియా జనరల్ కేటగిరీలో 117వ ర్యాంక్ సాధించగా.. అరవింద్‌నాయక్ ఎస్టీ కేటగిరీలో 33వ ర్యాంక్ సాధించారు.

బీసీ గురుకుల విద్యార్థులకు ర్యాంకులు

హైదరాబాద్, జూన్9 (నమస్తే తెలంగాణ): ఐఐటీలో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో బీసీ గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. బీ నిఖిత(267), ఆర్ పల్లవి(306), ఎస్ నందిని(768), కే అఖిల్ (1667), ఏ జగదీశ్(2360), ఎం శివకుమార్(4790) ర్యాంకులు సొంతం చేసుకున్నారు. బీసీ గురుకులాల నుంచి 21మంది అబ్బాయిలు, 28మంది అమ్మాయిలు మొత్తంగా 49మంది అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాశారు. వారిలో ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపక సిబ్బందిని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, గురుకుల విద్యాలయాల సెక్రటరీ సైదులు అభినందించారు.

క్యాటగిరీ	క్వాలిఫై అయినవారు
జనరల్	14,083
జనరల్ పీడబ్ల్యూడీ	236
ఓబీసీ ఎన్‌సీఎల్	9,281
ఓబీసీ పీడబ్ల్యూడీ	218
జనరల్ ఈడబ్ల్యూఎస్	5,423
ఈడబ్ల్యూఎస్ పీడబ్ల్యూడీ	85
ఎస్సీ	13,794
ఎస్సీ పీడబ్ల్యూడీ	41
ఎస్టీ	5,073
ఎస్టీ పీడబ్ల్యూడీ	14
మొత్తం	48,248

తెలుగు విద్యార్థుల ర్యాంకులిలా..

విద్యార్థి పేరు	ర్యాంకు
హెచ్ సాయి విదిత్	63
శ్రీ చరణ్	51
లక్ష్మీనర్సింహ	70
సూర్యవర్మ	76
అనూప్	166

సివిల్స్ రాసి.. ఐఏఎస్ అవుతా

ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు మాదాపూర్‌లో చదివా. నాన్న రామసుబ్బారెడ్డి, అమ్మ రాజేశ్వరి ప్రభుత్వ టీచర్లు. పదో తరగతిలో 10 జీపీఏ, ఇంటర్‌లో 987 మార్కులొచ్చాయి. జేఈఈ మెయిన్‌లో 99 పర్సంటైల్, తెలంగాణ ఎప్‌సెట్‌లో 4వ ర్యాంకు వచ్చింది. 338 మార్కులతో జేఈఈ అడ్వాన్స్‌డ్ టాప్ -3లో నిలువడం సంతోషాన్నిచ్చింది. రోజుకు పది గంటలకు పైగా కష్టపడ్డా. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ కోర్సులో చేరుతా. చదువులు పూర్తయ్యాక, సివిల్స్ రాసి ఐఏఎస్ ఆఫీసర్‌ను అవుతా.

- సందేశ్, ఆలిండియా మూడో ర్యాంకు

బాంబే ఐఐటీలో సీఎస్ఈ కోర్సులో చేరుతా..

నాకు జేఈఈ మెయిన్‌లో 295 మార్కులొచ్చాయి. ఆలిండియా ర్యాంకు 120 వచ్చింది. అయినా నిరాశపడకుండా అడ్వాన్స్‌డ్‌కు అవిశ్రాంతంగా కష్టపడ్డా. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 334 మార్కులొచ్చాయి. ఆలిండియా ఐదో ర్యాంకు వచ్చింది. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ కోర్సులో చేరుతా. తెలంగాణ ఇంటర్ పరీక్షల్లోనూ మంచి మార్కులు సాధించా. నాన్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అమ్మ గృహిణి. ప్రిపరేషన్ సమయంలో ఒత్తిడిని దూరం చేసుకునేందుకు బ్యాడ్మింటన్ ఆడేవాడిని.

- పుట్టి కుశాల్‌కుమార్, ఆలిండియా ఐదో ర్యాంకు

కంపెనీ పెడుతా.. సీఈవో అవుతా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా పదో ర్యాంకు రావడం సంతోషాన్నిచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 10-12 గంటలు కష్టపడ్డా. కష్టానికి తగినట్టు 329 మార్కులొచ్చాయి. నాన్న సతీశ్ ఐఆర్ఎస్ అధికారి. అమ్మ సుష్మ గృహిణి. ప్రిపరేషన్ సమయంలో అస్సలు టెన్షన్‌పడలేదు. ర్యాంకు కోసం నేను చదవలేదు. నలుగురిలా పనిచేయడం కాకుండా నలుగురికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని నాన్న ఉద్బోధించారు. బీటెక్ తర్వాత కంపెనీ పెడుతా.. సీఈవోనవుతా.

- ఏ ఎస్ఎస్‌డీబీ సిద్ధ్విక్ సుహాస్, ఆలిండియా 10వ ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం

హనుమకొండ చౌరస్తా, జూన్ 9: దేశంలో కెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ(అడ్వాన్స్‌డ్)-2024లో ప్రవేశానికి ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన విజయాలను సాధించి జాతీయస్థాయిలో ఎస్సార్ విజయపథాన్ని మరోసారి ఎగురవేశారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. జేఈఈ(అడ్వాన్స్) 2024 ప్రవేశ పరీక్షలో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో అన్ని కేటగిరీలు కలిపి జి.నవీన్ 8వ ర్యాంకు, పి.రాకేష్ కుమార్ 36వ ర్యాంకు, జే.శ్రీనిత్‌సందేశ్ 123వ ర్యాంకు, వి.రాంబాబు 125వ ర్యాంకు సాధించి ఎస్సార్ కీర్తి ప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టారన్నారు. ఇంకా వి.వేదవచన్‌రెడ్డి 127, జే.శ్రీతన్‌రెడ్డి 133, బోడ దినేష్ 157, మాలోత్ వెంకటేశ్వర్లు 185, దాసరి కార్తీక్ 299, తిలావత్ అఖిల్‌నాయక్ 323, కె.శ్రీరాంరెడ్డి 324 ర్యాంకు సాధించినట్లు, వీటితో పాటు ఓపెన్, అన్ని కేటగిరీలు కలిపి జాతీయస్థాయిలో వరసగా 450, 598, 621, 654, 689, 737, 751, 901, 966 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ(అడ్వాన్స్డ్)లో విద్యార్థులు సాధించిన ఈ విజయాలకు సంతోషాన్ని తెలియజేస్తూ ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి భవిష్యత్‌లో మరింత అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. 50 సంవత్సరాల్లో పటిష్టమైన ప్రణాళికలతో హైస్కూల్, జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీలలో విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులు ఈ సంవత్సరం ఐపీఈ, జేఈఈ(మెయిన్), టీఎస్ఎంసెట్, నీట్‌లో కూడా విశిష్టమైన మార్కులు, ర్యాంకులు సాధించారని, ఈ ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు. ఎస్సార్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన వారు దేశ, విదేశాల్లో వేల మంది ఉన్నతమైన పదవుల్లో ఉన్నారని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.



జి నవీన్



పి.రాకేష్‌కుమార్

కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి 5వ ర్యాంకు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ -2024 ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ పాఠశాల పూర్వ విద్యార్థులు పలు ర్యాంకులు సాధించారు. ఓపెన్ క్యాటగిరీలో 5వ ర్యాంకు సాధించిన పుట్టి కుశాల్‌కుమార్, 55వ ర్యాంకు సాధించిన సతివాడ జ్యోతిరాదిత్య తమ పాఠశాల పూర్వ విద్యార్థులేనని విద్యాసంస్థ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. తమ విద్యార్థులు 100లోపు 3, 5, 9, 12, 17, 26, 28, 45, 55, 64, 88 వంటి 12 ర్యాంకులు సాధించినట్టు వెల్లడించారు.



కుశాల్‌కుమార్

ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

కమాన్‌చౌరస్తా, జూన్ 9: ఐఐటీ అడ్వాన్స్‌-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక ప్రణాళిక, అధ్యాపకుల అవిశ్రాంత పాఠ్యబోధన, విద్యార్థుల కృషితోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం అల్ఫోర్స్ అందిస్తున్న శిక్షణ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీలలో సీట్లు సాధించే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం వెలువడిన ఐఐటీ అడ్వాన్స్ ఫలితాల్లో వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారన్నారు. ఇందులో ఎం హర్షిత్ 64వ ర్యాంకు సాధించగా, జీ శ్రీహాస్ 290, బీ భరద్వాజ్ 396, ఆర్ పునీత్ మనోహర్ 477, సుబోద్ దరి 545, ఏ శివవరుణ్ 557, పి రాహుల్ 571, దేవదత్త 751, విశాల్ రెడ్డి 838, డీ రిశ్వంత్ కుమార్ 1029, పీ మనోహర్ 1229, నిహాల్ 1379, ఆదిత్యవర్ధన్ రావు 1523, లహరి 1609, అరుణ్ కుమార్ 1658, బీ అభినవ్ సిద్ధార్థ రెడ్డి 1851, సత్య అమూల్య 1933 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని మరింత పెంచారని చెప్పారు. అలాగే, వెయ్యి లోపు తొమ్మిది మంది విద్యార్థులు, 2000 లోపు 17 మంది, 5000 లోపు 32 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారిని అభినందించి సత్కరించారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి